క్లుప్తంగా

'ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి'

పాతమంచిర్యాల: ప్రభుత్వ నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి అరిగెల మహేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యులు రోగుల నుంచి కన్సల్టెన్సీ ఫీజు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారని, దీనిని రద్దు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో కొన్ని ప్రైవేటు వైద్యశాలలు మల్టీస్పెషాలిటి ఆస్పత్రి అని బోర్డులు పెట్టుకున్నప్పటికీ అందులో కనీస వసతులు కానరావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, రాజశేఖర్, తిరుపతి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన 'నేషనల్ ఒలింపియాడ్ 2024' ఫలితాల్లో అభ్యాస విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 3 నుంచి పదోతరగతి వరకు ప్రకటించిన ఫలితాల్లో అభ్యాస పాఠశాల నుంచి మూడు స్టేట్ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సాన సుధాతి తెలిపారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన అరుష్, ఆగస్త్య, వన్స్‌శర్మలను అభినందించారు.

ధాన్యం తరలింపునకు చర్యలు



లోడింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

భీమారం: రైతుల వద్ద కొనుగోలు చేసిన వరిధాన్యం బస్తాలను వెంటవెంటనే రైస్‌మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ సదానందం అన్నారు. బుధవారం మండలంలోని పోలంపల్లి, సుంకరిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. వర్షాకాలం సమీపిస్తుండటంతో కొనుగోళ్ల మరింత వేగవంతం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.


ఆర్థికసాయం అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని నార్లాపూర్‌కు చెందిన ఒగ్గు కళాకారుడు వెంకటేశ్ ఇటీవల జగిత్యాలలో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం కుర్మ కుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు సేకరించిన లక్ష రూపాయల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గుంట శ్రీశైలం, దామరకొండ రాయమల్లు, గోవర్దన్ బండి శంకర్, సత్తయ్య, సాగర్ చిన్నయ్య, సమ్మయ్య, కుమార్, రాజయ్య, ఆనంద్, తదితరులు ఉన్నారు.

కళాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

చెన్నూర్: పట్టణంలోని పాత తహసీల్ కార్యాలయం వద్ద లైవ్ డ్రాయింగ్ ముగింపు సభ వాల్ పోస్టర్‌ను బుధవారం పోచం మిత్ర బృందం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నూర్ పట్టణానికి చెందిన నిరుపేద విద్యార్థి ఎల్పుల పోచం మొట్టమొదటి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కళాయాత్ర చేపట్టి చరిత్ర తిరిగ రాశారన్నారు. ఎన్నో కష్టాలను భరించి 2017 నుంచి 2024 వరకు దేశ వ్యాప్తంగా ఏడు సంవత్సరాల పాటు కళాయాత్ర చేపట్టి చెన్నూర్ పేరు దేశ వ్యాప్తంగా పరిచయం చేశారన్నారు. దేశంలోనే లైవ్ డ్రాయింగ్ చేపట్టిన మొట్టమొదటి వ్యక్తి చెన్నూర్ బిడ్డకావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు రెవెల్లి మహేశ్, పిట్టల రవి, శ్రీకాంత్, ముజ్జు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి



అవగాహన కల్పిస్తున్న చిరంజీవి

ఆసిఫాబాద్‌రూరల్: రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి చిరంజీవి అన్నారు. బుధవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని, విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా లూజు విత్తనాలను విక్రయిస్తే వ్యవసాయాధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అదే విధంగా మండలంలోని గోండుగుడా గ్రామంలో ఏఈవో సిడాం రాము, వాడిగొందిలో ఏఈవో గంట రాము, మోంగుబాయిగుడలో ఏఈవో రెహెమాన్‌లు రైతులకు అవగాహన కల్పించారు.

ఆటలు ఆడేదెలా?



నిరుపయోగంగా మాదారం క్రీడా ప్రాంగణం

- అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు
- నామమాత్రపు నిర్మాణాలతోనే సరి
- రూ.లక్షల నిధులు వృథా

బెల్లంపల్లిరూరల్: గ్రామీణ ప్రాంత వాసులకు ఆటలతో పాటు ఆహ్లాదాన్ని అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ ఆట స్థలాలు నిరుపయోగమయ్యాయి. అసంపూర్తి నిర్మాణాలు, కానరాని సౌకర్యాలతో ఆనవాళ్లు కోల్పోయి పాలకుల వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవడంలో అధికార యంత్రాంగం శ్రద్ధ చూపకపోవడం శోచనీయం.

నియోజకవర్గ వ్యాప్తంగా...

బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల్లో 114 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 144 తెలంగాణ క్రీడా ప్రాంగణాలు చేపట్టేలా గతంలోనే అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే దాదాపు 128 నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా కొన్నిచోట్ల భూవివాదాల కారణంగా, ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలు పూర్తి చేయలేకపోయారు. పూర్తి చేసిన నిర్మాణాలు సైతం అనుకూలంగా లేక క్రీడాకారులు వినియోగించుకునే పరిస్థితులు లేకుండా పోయాయి.

అసంపూర్తి నిర్మాణాలు...అరకొర వసతులు

క్రీడా ప్రాంగణాల్లో క్రీడాకారులకు అనువుగా ఉండే విధంగా ప్రభుత్వం పలు వసతులతో కూడిన నిర్మాణాలు చేపట్టేలా ఆదేశాలు ఇచ్చింది.అందులో భాగంగానే క్రీడా ప్రాంగణాల్లో స్వాగతబోర్డు, వాలీబాల్ కోర్టు, కబడ్డీ కోర్టు, ఖోఖో, లాంగ్‌జంప్‌తో పాటు పలు ఆటలు ఆడుకునేందుకు అనుకూలంగా అన్నిరకాల వసతులు కల్పించాల్సి ఉంది. దీంతో పాటు వాకింగ్ ట్రాక్, వ్యాయామం చేసుకునేందుకు కూడా సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో ఇవి అనుకున్న మేర కానరావడం లేదు.

ఆరంభ శూరత్వమే...

క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో పాలకుల ఆరంభ శూరత్వమే కనిపిస్తోంది. నిర్మాణ సమయంలో తొలుత ఎంతో ఆసక్తి కనబరిచిన అధికార యంత్రాంగం ఆతర్వాత అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో చాలా చోట్ల అసంపూర్తి నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల అరకొర వసతుల కారణంగా, సరైన దారిలేని కారణంగా నిరుపయోగంగా మారాయి. పిచ్చి మొక్కలు పెరిగి వనాలను తలిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

ఆడుకునేందుకు వీలులేకుండా ఉంది



మాదారం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన రెండు క్రీడా ప్రాంగణాలు ఆడుకునేందుకు వీలు లేకుండా ఉన్నాయి. కనీస సౌకర్యాలు కల్పించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సౌకర్యాలు కల్పించి వినియోగంలోకి వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– అన్నందాసరి రాజేశ్, మాదారం, తాండూర్

వినియోగంలోకి వచ్చేలా చర్యలు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. కొన్నిచోట్ల సామగ్రి చోరీకి గురికాగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. భూ వివాదం, ప్రభుత్వ భూమి కొరత ఉన్న ప్రాంతంలో ఉన్నతాధికారుల చొరవతో నిర్మాణాలు చేపట్టి వినియోగంలోకి తీసుకొస్తాం.

– సఫ్దర్ అలీ, ఇన్‌చార్జి డీఎల్‌పీవో, బెల్లంపల్లి

ప్రజాసమస్యలు తెలుసుకునేందుకే పర్యటన

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గ్రామాల్లో పర్యటిస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం జన్నారం మండలం కవ్వాల్, హాస్టల్ తాండా, లోతొర్రే గిరిజన గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ కారణంగా ఎలాంటి పనులు చేయడానికి వీలు లేకుండా పోయిందన్నారు. కోడ్ ముగియగానే అన్ని గ్రామ పంచాయతీల్లో పర్యటించి సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరిస్తానని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందన్నారు. అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ఎంపీటీసీ రియాజొద్దీన్, నాయకులు సుభాష్‌రెడ్డి, శంకరయ్య, ఫసీఉల్లా, ఇందయ్య, రమేశ్, ముత్యం రాజన్న, రాకేశ్, ముజ్జు, తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు సమాయత్తం కావాలి



మాట్లాడుతున్న శివకృష్ణ

బెల్లంపల్లి: వానాకాలం పంటల సాగుకు రైతులు సమాయత్తం కావాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట శివకృష్ణ సూచించారు. బుధవారం కేవీకే ప్రాంగణంలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందస్తుగా రైతులు వేసవి దుక్కులు దున్నుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. శుద్ధిచేసిన నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. సమగ్ర పోషక, చీడపీడల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. కూర గాయల సాగు పద్ధతులను కేవీకే శాస్త్రవేత్త ప్రవంతి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ నార్మ్ బోర్డు సభ్యుడు గోనె హన్మంతరావు , కేవీకే శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ఎఫ్‌పీసీ సభ్యులు శంకర్, శ్రీనివాసరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ స్థలం మార్చవద్దని నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల, అంతర్గాం మధ్య గోదావరినదిపై గత ప్రభుత్వం ప్రతిపాదించిన స్థలంలో ప్రస్తుత ఎమ్మెల్యే మార్పునకు ప్రయత్నిస్తున్నారంటూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2018లో బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.125 కోట్లు కేటాయిస్తే, 2023 నాటికి రూ.165 కోట్లకు పెంచి పనులను మధ్యలో నిలిపివేశారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తన స్వలాభం కోసం బ్రిడ్జి నిర్మాణ స్థలంను వేరే ప్రాంతానికి మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గతంలో ప్రతిపాదించిన చోట వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొద్దు రఘునందన్, కర్రె లచ్చన్న, సత్రం రమేశ్, ముదాం మల్లేశ్, జోగుల శ్రీదేవి, కంకణాల సతీశ్, ఆకుల సంతోశ్, తుల మధుసూదన్, ఆవిడపు రాజబాబు, పచ్చ వెంకటేశ్వర్లు, రెడ్డిమల్ల అశోక్, అమిరిశెట్టి రాజు, పల్లి రాకేశ్, మద్ది సుమన్, నాగుల రాజన్న, కొండవీటి తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు చేరిన వినీత్ పాదయాత్ర



వినీత్‌ను సన్మానిస్తున్న హనుమాన్ దీక్షాపరులు

మంచిర్యాలఅర్బన్: హనుమాన్ దీక్ష ధరించిన పట్టణానికి చెందిన వినీత్ రామ్‌లల్లా దర్శనం చేసుకునేందుకు ఒంటరిగా కాలినడకన బయలుదేరి అయోధ్యకు చేరుకున్నారు.'హగత నెల 22న మంచిర్యాల నుంచి బయలుదేరి 38 రోజుల పాటు పాదయాత్ర చేశాడు. రోజుకు 80 నుంచి 100 కిలోమీటర్లు మేర నడిచాడు. మంచిర్యాలకు చెందిన వీర హనుమన్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బింగి ప్రవీణ్ నేతృత్వంలో వినీత్‌ను ఘనంగా సన్మానించారు. అయోధ్య నుంచి తిరుగు ప్రయాణానికి తోకల అవినాష్ టికెట్ కొనుగోలు చేయటంతో బుధవారం రాత్రి రైలులో మంచిర్యాలకు బయలుదేరాడు. సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని వినీత్ 'సాక్షి'కి తెలిపారు.

రోడ్డు పనులు పరిశీలించిన 'నడిపెల్లి'



పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలోని తిలక్‌నగర్ నుంచి హమాలివాడ అండర్ బ్రిడ్జి వరకు రూ.5.85 కోట్లతో ప్రారంభించిన రోడ్డు పనులను మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో ప్రస్తుతం జరిగే ప్రతి పని తాను తీసుకొచ్చిన నిధుల నుంచే చేస్తున్నారని, ప్రస్తుత ఎమ్మెల్యే గెలిచిన తరువాత ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా తెచ్చింది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు తాజుద్దీన్, శ్రీరాముల మల్లేశ్, కర్ర శంకర్, తోట తిరుపతి, శ్రీపతి శ్రీనివాస్, పడాల శ్రీనివాస్, మహ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నెన్నెల: మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చాలని కోరుతూ బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి మనోహర్ బుధవారం తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ జనగణన చేస్తామని, జనాభాకు అనుగునంగా బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దండె భూమన్న, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు ఓదెలు, జనార్దన్ గౌడ్, రాజన్న, తిరుపతి, అరుణ్‌సింగ్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరాల యూనిట్ ప్రారంభిస్తున్న సీఐ

కాసిపేట: గ్రామాల్లోని కూడళ్లలో గ్రామస్తులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని దేవాపూర్‌లో ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూంను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా నేరం, సంఘటన జరిగినప్పుడు ఆధారాలు సేకరించేందుకు ఉపయోగపడతాయన్నారు. కేసును త్వరగా ఛేదించవచ్చని, రోడ్లు, వీధుల్లో ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకు రావాలన్నారు. దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు పరిశీలించిన ఆర్డీవో



పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

భీమిని: కన్నెపల్లి మండలంలోని మెట్‌పల్లి, కన్నెపల్లి గ్రామ పంచాయతీల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో హరికృష్ణ బుధవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెట్‌పల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు ఎక్కువగా ఉన్నాయని, లారీల కొరత ఉందని రైతులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా లారీ అసోసియేషన్ నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడి లారీలను ఎక్కువగా పంపించాలన్నారు. కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ కిషన్, తదితరులు ఉన్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు



మరమ్మతు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని దొనబండలో 20 రోజులుగా పరిష్కారానికి నోచుకోకుండా స్థానికుల రాకపోకలకు ఇబ్బందులకు గురిచేస్తున్న మంచినీటి పైప్‌లైన్ లీకేజీకి ఎట్టకేలకు బుధవారం మరమ్మతులు చేశారు. దొనబండ నుంచి పెద్దంపేట వైపు వెళ్లే దారిలో ఈ నీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీ కావడంతో రోజూ రోడ్డుపై నీరు చేరుతోంది. ఇరవై రోజులు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. 'సాక్షి' దినపత్రిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన కార్యదర్శి ఉదయ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గిరిజ పంచాయతీ సిబ్బంది హుటాహుటినా పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

జైపూర్: విదేశీ పర్యటన ముగించుకుని నియోజకవర్గానికి వచ్చిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుసదస్సులు కొనసాగింపు

దండేపల్లి: పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు చేపట్టిన రైతు సదస్సులు దండేపల్లి మండలంలో కొనసాగుతున్నాయి. మండలంలోని రెబ్బనపల్లిలో ఏఈవోఅర్చన బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశ గడువు పొడిగింపు

కాసిపేట: మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 31 వరకు గడువు పొడగించినట్లు ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో ప్రతీ గ్రూపునకు 40 సీట్ల చొప్పున 160 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. జూన్ మొదటి వారంలో దరఖాస్తులు పరిశీలించి ఎంపిక జాబితాను ప్రదర్శిస్తామని, పదోతరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏవో వందన

కాసిపేట: రైతులు నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి వందన సూచించారు. బుధవారం మండలంలోని చింతగూడ, పెద్దనపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. లూజ్ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, సంబంధిత లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదు తీసుకుని భద్రపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు అంజలి, రమ్య , రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు బెడ్‌షీట్లు, బ్లాంకెట్లు పంపిణీ



పంపిణీ చేస్తున్న సంతోశ్‌కుమార్ శాస్త్రి

చెన్నూర్: పట్టణంలోని సాయి అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో మ్యాన్ కైండ్ ఫార్మా ఆధ్వర్యంలో శృంగేరి ఆస్థాన ప్రతినిధి బాచంపల్లి సంతోశ్‌కుమార్ శాస్త్రి చేతుల మీదుగా వృద్ధులకు బెడ్‌షీట్లు, బ్లాంకెట్లు, దిండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పుల్లూరి సత్తయ్య, బీజేపీ నాయకులు గర్రెపల్లి వెంకటనర్సయ్య, వాసవి క్లబ్ కోఆర్డినేటర్ పెద్ది రాజేందర్, అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు రేణిగుంట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

రామకృష్ణాపూర్: స్థానిక కోదండ రామాలయం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన హనుమాన్ భక్తుల శోభాయాత్ర వైభవంగా సాగింది. హనుమాన్ మాల ధరించిన స్వాములు, భక్తులు పట్టణ పుర వీధుల గుండా హనుమాన్ సంకీర్తణలు పాడుతూ నృత్యం చేస్తూ ఉత్సాహంగా యాత్రలో పాల్గొన్నారు.

అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న నాయకులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో కొక్కిరాల రఘుపతిరావు జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కేంద్రంలో బుధవారం 55వ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ, ఎంపీటీసీ పార్వతి మల్లేశ్, నాయకులు అన్నం కుమార్, అనంతరావు, ప్రవీణ్, ఓరియంట్ కార్మికులు పాల్గొన్నారు.